# నిరుటి దీపావళి*

ముడుంబ నరసింహాచార్యులుగారు

౧

ఆనాడు నరక చతుర్దశి. సెలవుదినము. ఖులాసాగా మాట్లాడుకొందామని అలవాటుచొప్పున రామారావు వెంకటశాస్త్రి యింటికి మధ్యాహ్నము రెండుగంటలకే బయలుదేరి వెళ్లినాడు.

రామారావు హేలాపురి ఉన్నతపాఠశాలలో స్కూలుఫైనలు పూర్తి చేసినాడు. వెంకటశాస్త్రి ఆయూరి జాతీయమహావిద్యాలయములో ఉన్నతతరగతి యందు విద్య నేర్చుచున్నాడు. ఒక్కబడి కాకపోయినను సమవయస్కులగు ఆయుభయులకు చాల స్నేహము. ఇరువురు పరిహాసభాషణప్రియులే. ఇద్దఱును ఖద్దరు వస్త్రధారులే. దేశాభిమానములోను ఒకరికొకరు తీసిపోరు.


తన చదువులగదిలో రాట్నముదగ్గఱ కూర్చుండి నూలు వడకుచున్న వెంకటశాస్త్రికి రామారావును చూడగానే ప్రాణములు లేచివచ్చినవి. మొగము వికసించినది. నూలు వడకుచున్నవాడు అది మాని చటుక్కున లేచి, "రామారావ్! రా! రా! నీకోసమే చూస్తున్నాను. కూర్చో" అని చెప్పుచు, మీఁది బల్లపైనున్న రెండు తలగడాలు అందుకొని ఎదురుగా గోడ ప్రక్కను పఱచియున్న తివాచీమీదకు వాటముగా విసరివైచినాడు.

"రెం డెందుకు తలగడాలు? రాట్నం పని మాని నీవుకూడా తివాచీమీద చేరుదామనా?— నిర్జీవమైన రాట్నానికి విశ్రాంతి అవసరము లేకపోయినా, నీవంటి జీవుడికి కొంత విశ్రాంతి యుండవల్సిందే—సరే. నీ వీపాటికి లేచిరా, నేను రాట్నం పని పట్టి స్తా—కదు రాడుచుంటే నేకాని కాటకం పోదన్నారు పెద్దలు" అన్నాడు రామారావు.

"కదు రొక్కటే కాదు—కదురూ కవ్వముకూడ —ఆడితేగాని కాటకం పోదు." అని నవ్వుకొనుచు లేచివచ్చి వెంకటశాస్త్రి తివాచీమీద కూర్చున్నాడు.

"అయితే నీవు రాట్నాని కెదురుగుండా ఒక రాట పాతి చల్లకుండ పెట్టి కవ్వము త్రిప్పడముకూడా ప్రారంభించు. ఇద్దరం పోటీలమీద కదురు, కవ్వము ఆడించి కాటకాన్ని పారతోలుచున్నామంటే పల్లెన్న వాళ్లంతా పకాల్న నవ్వుతారు" అని చప్పట్లు చరచి బొబ్బనవ్వు నవ్వుచు రామారావు రాట్నమువద్ద చేరి నూలువడుకుట ప్రారంభించినాడు.

వెంకటశాస్త్రి ఒక తలగడ వీపువెనుక, ఒకటి మోచేతిక్రింద పెట్టుకొని, మోకాళ్లు ముందుకు ఎత్తియుంచి, ఒయ్యారముగా గోడను ఆనుకొని, తివాచీమీద బాలచంద్రాకృతిగా పండుకొనియున్నాడు.



* ఈ కథకు చిత్రములు కథకుని రెండవకుమారుడును, ఏలూరునందలి శ్రీ గాంధి జాతీయమహావిద్యాలయమున ౧౦ వ తరగతిలో చదువుచు కవిత్వమును, చిత్రలేఖనమును అభిమానవిద్యలుగ నభ్యసించుచున్న విద్యార్థియు నగు "ము. నరసింహాచార్య" యను విద్యార్థి పెన్సిలుతో చిత్రించినవి. —భారతి.

రామా: నీ వాలాను దర్జాగా పడి యుండడానికి కాదు_నిన్ను కాళీగా యుంచింది_

వెంక: ఏమి చేయమన్నావు_నన్ను ?

రామా: కథో, కారుణ్యమో_ ఒకటి_ప్రారంభించు, మఱి_

వెంక: (నవ్వుచు) ఈమత్తలకాయ కథ చెప్పనా ?

రామా: నిన్న మీవిద్యాలయంలో మీటింగైందటే! విశేషా లేమీ లేవూ?

వెంక: మీటింగేమిటి? ఊరికే విద్యార్థులందరిని సమావేశపర్చి దీపావళికథ చెప్పినారు_అంతే.

రామా: ఆకథాసారాంశం టూకీగా నాలుగువాక్యాలలో చెప్పగల విప్పుడు?

వెంక: కావలెనంటే ఒక్క వాక్యంలోనే తేల్చేస్తా.

రామా: ఏదీ_మఱికానీ. నీశక్తి చూద్దాము.

వెంక: నీవుమాత్రం శ్రద్ధగా వినవలె_టపా_కాయలు_కాల్చ_కూడదు.

రామా_కథేదీ ?

వెంక: కథెందుకు? కథాసారాంశమేగా నీ వడిగింది?

"సారాంశ మంటే కథాసంగ్రహమని నాఉద్దేశ్యము" అని రామారావు ప్రసన్నముఖుడై రాట్నపుకనిని తదేకదృష్టితో సాగించుచుండెను.

## ౨

వెంకటశాస్త్రి కథ ప్రారంభించినాడు. "నీవు విన్న కథేనోయ్_ద్వాపరయుగాన, నరకమహారాజు పరిపాలనలో అధికార నిరంకుశత మెక్కువై పోయింది. శ్రీకృష్ణమూర్తి ప్రబోధముచేత ప్రజలు నరకమహారాజుతో సహాయనిరాకరణ మవలంబించినారు. రాజు వారిని నానాబాధలు పెట్టించినాడు. జైళ్లలో ఉంచినాడు. తిండికి, బట్టకు, దీపానికికూడ కఱవు వచ్చేలాగు చేసినాడు. ఏమి చేసినను ప్రజలు వాళ్ల ధర్మదీక్ష విడువలేదు. చివరకు శ్రీకృష్ణుని దయచేత నరకపాలన మంతరించినది. మఱునాడు నరకుని కొడుకు భగదత్తుడు రాచబొక్కసములో నున్న ధనరత్న రాసు లన్నియు తెప్పించి ప్రజలకు బంచిపెట్టించినాడు. ప్రజలు తమ తమ సొమ్ములు లెక్కపెట్టుకొని సంతోషించినారు. ఆసంగతి జ్ఞాపకముంచుకొనుటకే కొన్ని ప్రాంతాలవారీపండుగకు ధనలక్ష్మీపూజ చేయుచున్నారు. ఆనాడు ప్రజ లానందమున దీపారాధనలు చేసికొన్నారు. ఆదీపారాధనలకు ప్రతిగానే మనవారీపండుగకు దీపావళులతో గృహాలను అలంకరించుచున్నారు. ఆరోజున విజయ సూచకముగా ఫిరంగులు మ్రోయించినారు. ఆ జ్ఞాపకార్థము ఇప్పుడు బాణసంచులు కాల్చుచున్నారు."

రామా: (నవ్వుచు) సరే. బాగుంది కాని_నే నింకోకథ చెపుతాను. నీకు కోపము రాదుకదా?

వెంక: మధ్య_నా కెందుకు_కోపము?

రామా: నీకు కొంచెము వ్యతిరేకముగా మాట్లాడవలసి వస్తూంది_అందుకు చెపుతున్నాను.

వెంక: నీవు నాకు వ్యతిరేకంగా మాట్లాడని దెప్పుడు? కానియ్యి_ఎంతవిమర్శనకైనా నేను తయారుగానే యున్నాను.

రామా: అసలు పూర్వము నరకాసురు డనే ఒక రాజున్నా డన్నమాట సత్యాబద్ధం.

వెంక: (ముక్కుమీద వ్రేలు వైచికొని) ఎంతమాట మఱి నరకచతుర్దశి ఎందుకు పుట్టిం దంటావు?

రామా: ఈ విషయాన్ని గురించి వేదాన్ని తలతన్నేటంత ప్రామాణ్యమైన యొక కథను ఈ మధ్య నా కొకానొకరు చెప్పినారు. ప్రత్యక్షప్రమాణంగా కనబడే ఆకథాంశాలను నాస్తికుడైనా కాదనలేడు.

వెంక: నాస్తికులకథ చెప్పకుమ మా_ప్రాయశ్చిత్తం చేసికోవలసి వస్తుంది.

రామా: (నవ్వుచు) అబ్బే_ప్రత్యక్షంగా జరుగుచూన్న సంగతేనోయ్, నే జెప్పేది_సత్యభామా సమేతుడైన శ్రీకృష్ణుడు నరకరాజును చంపినట్టుగదా

భాగవతములో వ్రాసినారు! ఆకథలోనివారంతరు వట్టి కల్పిత వ్యక్తులే.

వెంక: (చెవులు మూసికొని) "పెళ్లికొచ్చినవాళ్లంతా నాపెళ్లాలే" అన్నట్టుంది నీమాట—చాలు చాలు. ఊరుకో.

రామా: చెవులు మూసికొంటా వెందుకు? "వినదగు నెవ్వరు చెప్పిన" అనేపద్యము అర్థముతో వల్లించి కూడ—నీ వింత పామరత్వంలో పడిపోతావని నే నెప్పుడూ అనుకోలేదు.

"సరి. కానియ్యి—ఈవేళ, నీకూ నాకూ కూడా ప్రాయశ్చిత్తం, ఏలాగూ తప్పదు" అని తల పంకించుచు బాసినపట్టు వేసికొని కూర్చుండి వెంకటశాస్త్రి చిరునవ్వుతో కథాశ్రవణమునకు సంసిద్ధుడైనాడు.

## 3

పరిహాసభాషణప్రియుడగు రామారావు వడివడిగా రాట్నము త్రిప్పి నూలు వడుకుచునే తనవింతకథ మొదలుపెట్టినాడు:

"భాగవతకారుడు నరకాసురవధ శ్లేషార్థంగా చెప్పినాడు. ఏలాగంటే, ప్రజాకంటకుడైన నరకుడే దేశారిష్టదాయకములైన ఉక్కలపురుగులు—పరమాత్మస్వరూపుడైన శ్రీకృష్ణుడే వెలుగుచున్న దీపపువత్తి—రణప్రోత్సాహకారిణియైన సత్యభామే దీపమును ప్రజ్వరిల్ల చేసే చమురు—రణక్షేత్రమే ప్రమిద—ఫలిత మేమనగా; దీపపువెలుగుచే ఉక్కలపురుగు లాకర్షింపబడి, నూనెలో పడుటచేత ఎగురజాలనివై దీపపువేడిమికి మాడి, ఉక్కలూడగా ప్రమిదయందు పడి చనిపోవుటకే నరకాసురవధయని అర్థము—కాదు, కాదు—ఇది దండాన్వయం: మఱి తాత్పర్య మేమిటంటే—పూర్వ మొకప్పుడు ఉక్కలపురుగులు చెలరేగి నిరవకాశంగా ప్రపంచమంతయు ఆక్రమించి మనుష్యులు నిల్వడానికి ఆధారము లేకుండా చేయగా, నూనెదీపములచే వాటిని సంహరించడమనే సులభోపాయమును ప్రజలు కనిపెట్టి, ఆవేడుకను ప్రతి సంవత్సరము ఆచరించుచున్నా రనేదే—ఆయన చెప్పిన ఈసమాచారమంతా తమాషాగానూ, నమ్మదగిందిగానూ కనబడుచున్నది—ఏమంటావు?"

వెంక: పుణ్యకథలందు నమ్మకములేని పాషండుల మాటలు తమాషాగానే ఉంటవి. బహు నమ్మకముగా కూడా కనబడుతవి. అందుచేతనే అటువంటివాళ్లతో మాట్లాడినవాళ్లకు కలిగేపాపము అనేకజన్మ లెత్తినా పోదన్నారు—పెద్దలు. తుంటి కొట్టితే మూతిపళ్లు రాలినవన్నట్లు అమావాస్యనాడు దీపాలు పెట్టితే చతుర్దశినాడే పురుగు లెట్లు నశించుతవి?

రామా: ఒక్కరోజెక్కువ తక్కువ కేమిలే—అసలు చతుర్దశినాడే దీపాలు పెట్టి పురుగులను చంపవలసినది. అమావాస్యనాడేమో—బాణసంచులు కాల్చి గాలిని శుభ్రపర్చవలసినది.

వెంక: (ఎగతాళిగా)అయితే చతుర్దశినాడే దీపావళి అనక, అమావాస్యనా డన్నా రెందుకోయ్?

రామా: (పరధ్యానముగా) ఏమో! ప్రజలనోళ్లలో పడి బహుశా చతుర్దశి అమావాస్యలు తలక్రిందులై పోయి యుంటవి.


వెంక: బలే—బాగుంది, నీమాట. ఇంత సృష్టిచేసిన భగవంతునికి ఉక్కల పురుగులను చంపడమును, గాలిని శుభ్రము చేయడమును చేతకాక, మన భారతదేశములోని పారతంత్ర్యపు ప్రజలను శరణుచొచ్చినాడు కాబోలు, తనకు సహాయము చేయుడని. జీవహింస చేయుట, ధనము దుర్వ్యయము చేయుట అనునవి వేడుకలుగా మనపూర్వులెప్పుడును ఉద్దేశించలేదు. ప్రజలలో భక్తిజ్ఞానము లభివృద్ధిపఱచి, దేశమునకు అభ్యుదయము కలిగించుటకోసమే, మనపెద్దలు ఈపండుగలన్నియు ఏర్పాటుచేసినారు. నేటికాలానికి నీబోంట్లు బయలుదేరి పాషండవాదాలు చేసి పండుగలకు పెడఅర్థాలు తీస్తున్నారు.

"నీ స్వంత ఉపన్యాసం ప్రారంభించినావేమి కర్మమోయ్—మీ ఉపాధ్యాయులు చెప్పిన క్రొత్తసంగతు లేమైనా మొదలుపెట్టమంటేను—" అని చెప్పుచు రామారావు నూలుతో నిండిన కదురు తీసివైచి

ప్రక్కనున్న ఉత్తకదురొకటి అందిపుచ్చుకొని రాట్నమునకు పెట్టి వేగముగా నూలువడుకు పనిని సాగించుచుండెను.

## ౪

"అయితే మా ఉపాధ్యాయులు చెప్పిన ఒక విచిత్రకథ ఇక్కడ చిత్రిస్తాను—కాచుకో" అని వెంకటశాస్త్రి హుషారుగా క్రొత్తకథ ప్రారంభించినాడు—"పూర్వమొక గ్రామములో సంపన్నగృహస్థుడగు ఒక బ్రాహ్మణుని యింట్లో పాడిపంటలు సమృద్ధిగా ఉండేవి. అందుచేత వారియింట్లో ఏడు గండు పిల్లులు సింహాలులాగు తిరుగుచు అన్ని పదార్థాలలోను మూతులు పెట్టి తిన్నంత తినేవి. అవి తినగా మిగిలినవే ఇంటివారికి ప్రాప్తమాచుండేవి—అయితే వాళ్ల యింట్లో తద్దినం వచ్చినప్పుడుమాత్రం—తప్పకుండా ఈయేడు పిల్లులను తీసికొనిపోయి దొడ్లో ఉన్న పెద్ద చింతచెట్టుకు కట్టివేసేవారు. ఆబ్రాహ్మణుని యింట్లో ఉన్న పిన్న పెద్దలగు పిల్లవాండ్రంతా దొడ్లో కట్టివేసిన పిల్లులను చూడగానే "ఈవేళ మాయింట్లో తద్దినమోయ్—అప్పచ్చులు—చేస్తారు" అని ముసిముసి నవ్వులు నవ్వుకొనుచు—చేతులు ఊపుకొని షికార్లు చేయుచు—ఎగిరి గెంతులు వేయుచు—సంతోషముగా ఉండేవారు.



చూస్తున్నావా వాళ్ల కులాసా. ఈలాగు కొంత కాలము వెళ్లిపోయింది. తర్వాత ఆకుటుంబములో పాడిపంటలు తగ్గిపోయి, మార్జాలాలసంఖ్యకూడా క్షీణించి నాలుగు కాడికి వచ్చింది. మనపెద్దలు తద్దినానికి ఏడుపిల్లులను తప్పకుండా, దొడ్లో చింతచెట్టుకు కట్టేవారు—మనయింట్లో నాలుగుపిల్లులే ఉన్నవి. కనుక మిగిలిన మూడింటిని ఎక్కడో సంపాదించి దొడ్లో కట్టకపోతే, తద్దినము పడిపోతుందనియోంచి, రెండుమూడు రోజులు నానాతంటాలు పడి, ప్రయత్నించి, యేలాగో రోదనసంఖ్యగల పిల్లులను పూర్తిచేసి, దొడ్లో చింతచెట్టుకు కట్టి అప్పటివారు కృతార్థులగుచువచ్చేవారు.

ఆలాగు ఉండగా తరాలు వెళ్లిపోయినవి. పాశ్చాత్యనాగరికత బాగా దేశములో అలుముకొన్నది. వాళ్ల యింట్లో పాడిపంటలు పూర్తిగా నిండుకొన్నవి—ఒక్క పిల్లియైనా వాళ్లింటికి రావడము లేదు. పిల్లులు లేకపోతే తద్దినము పడిపోతుంది—ఏలాగురా—అని ఆలోచించి, చివర కానాటి బుద్ధిమంతులు 7 మట్టిపిల్లులను చేసి, చింతచెట్టుకు కట్టివేయడము మొదలుపెట్టినారు. పితృదేవతలు—పిండము—మంత్రాలు — భోక్తలు— మొదలైన వన్నీ, వాళ్లు పూర్తిగా మరిచిపోయినారు. ఇంత రాగిడిమట్టి తెప్పించిఏడుమాయపిల్లుల్ని చేయడం-వాటిని దొడ్లో చింతచెట్టుచుట్టూ కట్టడం—ఇంట్లో పిండివంటలు చేసికొని మ్రింగడం — క్రింద, దిగింది—తద్దినం.

రామా: (నవ్వుచు) అయితే తరాలు గడచిపోయినా ఆచింతచెట్టు ఆలాగే ఉందిటోయ్—పడిపోకుండా—?

వెంక: అబ్బో! చింతచెట్టుని పోనివ్వడమే? అదిపోతే కొంప మునిగిపోదూ? పాతతులసిమొక్కలు పోగా క్రొత్తతులసిమొక్కలును, పెద్ద మారేడు వృక్షము పోగా చిన్నమారేడుచెట్టును హరిహరుల దేవాలయాలలో ఎంతశ్రద్ధగా నాటుతారో అంతకన్న డెబ్బైరెట్లు ఎక్కువశ్రద్ధాభక్తులతో వాళ్లు చింతమొక్కలు జాగ్రత్తచేసి నాటుచుండేవారు.

రామా: (చిరునవ్వుతో) సరే—లే—అయినా మట్టిపిల్లల్ని కట్టడానికి బలమైన చింతచెట్టెందుకు? లేత మొక్కైనా చాలు—లేకుంటే మట్టితో చేసిన మాయ చింతమొక్కైనా చాలు.

వెంక: పైకథవిను మరి. వీరింటికి ఒకనాడు వైదికజ్ఞానసంపన్నుడైన ఒక బ్రాహ్మణుడు వచ్చినాడు. ఆరోజునే వీరింట్లో తద్దినం కూడా—వచ్చింది. ఆయన వాళ్ల తెలివితక్కువ చేష్టలన్నీచూచి తెల్లబోయి ఇంటియజమానికి తద్దినమంటే యేమిటో బోధించినాడు. మరిన్నీ—మంత్రాలు చదివి, పితృదేవతల నాహ్వానించి భోక్తలద్వారా వాళ్ల ఆకలిదప్పులు అణచడానికి మారుగా—దిక్కుమాలిన పిల్లులు—చింతమొక్క—నీవు—తయారయినావుటయ్యా? అని మొగము వాచేలాగు అతనిని నానాచీవాట్లుపెట్టి ఆపామండుని యింట్లో దిగినందుకు పశ్చాత్తాపపడి, ప్రాయశ్చిత్తంచేసికొని చక్కాపోయినాడు.

౫

కథాశ్రవణానంతరము రామారావు కొంచెమాలోచించి "ఈ పిడుపిల్లులు—పితృశ్రాద్ధముకథ ఆర్యకథానిధి 8 వ భాగములో—వెనుక మన మొకమారు చదివినాము. నీకు జ్ఞాపకములేదూ?" అని అడిగెను.

వెంక: లేకేమి? ఆకథనే ఇంకా వివరంగాను వినోదంగాను ఉండేలాగు మామాస్టరుగారు చెప్పినారు. నేన దిప్పుడు టూకీగా తేల్చివైచినాను.

"పాడిపంటలుండి ఇంట్లో పిల్లులున్న పూర్వీకుడొకడు కర్మం జాలక వాటినిదొడ్లో కట్టివేసినాడంటే అదే తద్దినానికి ముఖ్యమనుకొని పిల్లులులేనిదే పిచ్చిచేష్టలు చేసిన బీదబ్రాహ్మణు డెంత బుద్ధిమంతుడో, రాజ్యంపోయి, వృత్తులునశించి, భోగభాగ్యాలుపోయి దేశము దరిద్రావస్థలో నుండగా అప్పోసప్పోచేసి నాలుగురూపాయలు సంపాదించి, బాణాసంచాకొని తగులబెట్టి, దీపావళి వెళ్లించినామని సంతోషించేవాళ్లూ అంత బుద్ధిమంతులే" అని మామాస్టరుగారు చెప్పినారు.

రామా: ఒక్కదీపావళి అన్నమాటేమిటి? అన్ని పండుగలు—ఆలాగే అయినవి—ప్రజాభిప్రాయం ఈలాగు మారిపోయినప్పుడు నీవూ నేనూ తంటాలు పడి ఏటికి ఎదురీత లీదితే ఏమిప్రయోజనము?

వెంక: నీవు, నేను ఉపన్యాసా లిచ్చి లోకాన్ని బాగుపర్చ నక్కరలేదు. ప్రజలు, కనుక ధర్మదీక్షలో ఉండి కష్టసహిష్ణుతకు తయారైతే ఎట్టి నిరంకుశప్రభువులైనా లొంగిపోక తప్పదనే వాస్తవమును ప్రజలకు జ్ఞాపకముచేయుట కేర్పడిన ఈపండుగనుగురించి సరిగా అవగాహనచేసికొన్న మనబోటివాళ్లయినా బాణసంచుల వెఱ్ఱిలో పడడం మానవలె. దేశసౌభాగ్యాన్ని వృద్ధిచేసి ప్రజలయందు ధర్మదీక్షవృద్ధిచేసే నిర్మాణకార్యక్రమానికి పూనవలె. అదే మనధర్మం. అంతవరకే మనకు హక్కున్నది. నాలుగురోజులనుండి మాజాతీయ విద్యాలయానికి మేము దీపావళి భిక్ష వసూలుచేస్తున్నాము. దీపావళి ప్రభావమును సూచించే కరపత్రాలు పంచిపెట్టి జనులకు కర్తవ్యమును నచ్చచెప్పుచున్నాము. నూలువడికే ఉత్సాహముగలవారికి రాట్నాలు, కదుళ్లు, ఏకులు మొదలైనవి ఖరీదు పుచ్చుకొని సప్లయిచేస్తున్నాము. కొంతమందిమి ఖద్దరుప్రచారముకూడా చేస్తున్నాము.

రామా: ఈ పండుగరోజులలో ఈ పనులన్నింటికీ నేనుకూడా నాశక్తికొలది సహాయము చేయడానికి ఏమీ అభ్యంతరంలేదు. కాని నాకొక చిన్నసందేహమున్నది. అడుగమన్నావా?

వెంక: (నవ్వుచు) ఒకటికాదు—పది సందేహాలుండినా ఇప్పుడే తీర్చుకో—శంకానివృత్తిచేసికొనకపోతే చాలాచిక్కులున్నవి.

రామా: లోకమంతా టపాకాయలు—సీమటపాసులు—జింకాలు—తారాజువ్వలు—మతాబులు—ఠాప్, ఠూప్, ఠస్, ఠుస్, జుయ్, జూయ్—అని ఊరికే జాజ్వల్యమానంగా వెలిగించివేసి ఆనంద మనుభవించుచుంటే, తగుదుమమ్మా అని చందాలూ, భిక్షలూ వసూలుచేయుచూ — ఖద్దరుమూటలు బుజానవేసికొని

తిరుగవలెనంటే ఈ కలికాలంలో ఎవరు మనమాటలు వింటారు చెప్పుమా.

వెంక: బుగ్గల్ని తములపాకుల కిళ్లీలూ, నోట్లో సిగరెట్లూ పెట్టుకొని వంకపాపిళ్లు దిద్దుకుంటూ, రోజు రోజూ సినీమాలకూ, నాటకాలకూ బయలుదేరే, షోకేళీపురుషులతోపాటు నీవూ, నేనూ, ఆనంద మనుభ విస్తున్నామా? పోనీ కోడిపందేలలోను, జూదాలకొంప లలోను, వేశ్యాగృహాలలోను—లక్షలకు లక్షలు పందేలు పెట్టి, గెల్చుచూ, ఓడుచూ, ఒకనిమిషానికి లక్షాధి కారులు—మఱొక నిమిషానికి భిక్షాధములు—అగుచు ఆనందసముద్రములో ఓలలాడే వారిని మనము అనుకరిం చడం లేదేమి? ఆపనులు చేస్తేనే కాని మనకు సంతో షంరాదా? నిజంగా—నీవుచెప్పు! ఒకషుతాబా కాల్చ డం, ఎక్కువ ఆనందమా; ఒక ఏకునడికి దారం తీయడం ఎక్కువానందమా?

## ౬

వెంకటశాస్త్రి ప్రశ్నకు రామారావు వెంటనే జవాబు చెప్పలేదు. ఏదో ఆలోచించుకొనుచు, కొం చెము పరధ్యానముగా నుండుటచే గాబోలు అతనిచేతి లోని దారము తెగిపోయినది. కొసలు నలిపి దారము అతికించుకొని మరల రామారావు సంభాషణ మారం భించినాడు.

రామ: నామట్టుకు నాకు సూత్రవడకడమే సరదా—కాని అందరికి అలాగుంటుందా? ముఖ్యముగా—చిన్నపిల్లలమాట ఆలోచించు!

వెంక: తప్పని చెప్పిన తర్వాత చిన్నపిల్లలకు మాత్రం దానిలో ఆనంద మెందుకుంటుంది? జూద మాడడం—తప్పనికదా నీవు ఆడకుండా ఊరుకొ న్నావు. దాని రుచులు ఒక్కసారి చవిచూస్తే—మళ్లీ నీవదిమానగలవు?

రామా: టపాకాయలకూ జూదానికీ సాపత్య మేమిటోయ్? పోనీ—నాదగ్గర ఒకరూపాయ ఉన్నద నుకో—అందులో అర్ధరూపాయి ఏదీపావళి భిక్షుకో ఖర్చుపెట్టి, మిగిలిన అర్ధరూపాయతో నేను ఎందుకు బాణసంచా కొనుక్కొని కాల్చకూడదు?

వెంక: బాణసంచా కాల్చడంవల్ల దీపావళి సార్థక మౌతుందని నీకేమైనా నమ్మకముందా? పూర్వులు తమ కుసత్పరిపాలన లభించినప్పుడు విజయసూచకంగా ఫిరం గులు పేల్చుకొన్నారని, ఎన్నాళ్లకూ—పారతంత్ర్యము లోంచి బయట పడలేక—అసహాయులమై పడియున్న మనమిప్పుడు తగునునమ్మాయని టపాసులు కాల్చి వెఱ్ఱి సంతోషం వెల్లడించవలెనంటావా?—తద్దినానికి, భోక్తలకు మంత్రయుక్తంగా భోజనమూ పెట్టుతాను—దొడ్లో పిల్లులనూ కట్టించుతానంటే విన్నవాళ్లు అపహస్యం గా నవ్వరూ?

రామా: ఎందుకు నవ్వుతారులే—ఇప్పుడుకూడా ఒకళ్లింట్లో పదిపన్నెండు పిల్లులుంటవనుకో, వాళ్ల దొడ్లో ఏదో చెట్టుంటుందనుకో—తద్దినమంతా శాస్త్ర యుక్తంగా మంత్రాలతో జరుగనిచ్చి ఆపిల్లులను దొడ్లో చెట్టుకు కట్టివేస్తే తప్పేముందీ?

వెంక: తప్పా మరీతప్పా? ఆపిల్లులన్నిటినీ కట్టకూ డదు. అందులో ఏడుపిల్లులను మాత్రమే కట్టవలె. దొడ్లో ఏదో చెట్టుకుకట్టితే ఏలాగు? చింతచెట్టుకే కట్టవలె.

రామా: దానికేమిగాని—విదేశపుబాణ సంచులు మాని స్వదేశంవి కావలసినన్ని కొనుక్కొని కాల్చుకో మన్నారొక గొప్పజాతీయవాది—ఈ విషయమై నీ ఉద్దేశ్యమేమిటి?

వెంక: నిజమైన పిల్లులకోసం, ఇల్లిల్లూ తిరిగి ఒళ్లం తా బరుకుల మయం చేసికోకుండా, మట్టిపిల్లులను నీచిత్తం వచ్చినన్ని చేసి, చెట్టుకుకట్టి, తద్దినంపూర్తిచేసికొమ్మన్న హితోక్తితో దాన్ని పోల్చవచ్చును.


రామా: (తలఊపుచు) అయితే—మెట్టుకి—స్వదేశపు బాణసంచావల్ల ఏమీనష్టములేదని నిన్ను ఒప్పించినానన్నమాటే—

వెంక: అలాగైతే తద్దినానికి దొడ్లో మట్టిపిల్లుల్ని కట్టితే పిచ్చితనమనుకొంటారని నీకుభయంలేదన్నమాటే!

రామా: అవునుగాని—ఊళ్లో అందరు మతాబులు, తారాజువ్వలు వగైరా అన్నీ పంచుకొని ఉబలాట పడుతూఉంటే—మనమిక్కడకూర్చుంకి ఏకులూ, కదుళ్లూపంచుకొని, యిద్దరము చెతియొకరాట్నము ఎగుకెదురుగా వేసికొని త్రిప్పుచు దారాన్ని సృష్టిచేసి అపర బ్రహ్మానంద మనుభవించు దామనుంటావా?

వెంక: వాళ్లు అరవీసెడు మతాబాలూ కాల్చివేస్తే, చివరకు బూడిదయైనా మిగులకుండా అన్నీ అయిపోతవి—మనము అరవీసెడు ఏకులు వడికి దారము తీసినామంటే ఆనూలు చూదుకొన్నప్పుడెల్లా మనకు ఒళ్లు పరవశమయ్యేటంత ఆనందం కలుగుతూఉంటుంది.

అని వెంకటశాస్త్రి ముందునకువంగి తానింతకు ముందువడికిన దారము చుట్టబడియున్న పంటికట్టను కుడి చేతితో అందుకొని మెల్లగా బొంగరమువలె త్రిప్పుచు తననూలు నాణెమును చూచుకొనుచుండెను.



౭

వెంకటశాస్త్రి పలికినమాటలు వినగానే రామారావునకు పట్టరాని సంతోషముకలిగినది. ఇకతన వితండవాదమునకు స్వస్తిచెప్పి హృదయమిచ్చి మాట్లాడనారంభించినాడు.

రామా: నిజమేసుమా—నాకు ఈసంగతి నీకన్న ముందే తెలుసును. నీతో తమాషాకు ఈవాగ్వాదమంతా చేసినానుగాని నిన్ననే, నేను సవాసేరుఏకులు కొని తెచ్చినాను. ఇప్పుడు చెప్పడ మెందుకు? రేపు రాత్రి మాయింటివద్ద ఎంతతమాషా చేస్తామో ఒకసారి అటువైపువచ్చి చూచితే నీకే తెలుస్తుంది—అవునుకాని ఈవృథాకాలహరణ మెందుకు; దీపావళి చందాలకు బయలుదేరక?

వెంక: నేనైంది. నీవు నూలువడుకుతున్నావు గదా ఆటంకమెందుకని ఊరుకొన్నాను. ఇంకెన్ని ఉన్నవి ఏకులు—?

రామా: ఇంకేమిఉన్నవి? దీనితో అన్నీ అయిపోయినవి అని చేతులు దులుపుకొని లేచుచున్నాడు.)

వెంక: ఏమిటే! 20 ఏకులవూ నేను నాలుగు మాత్రమే వడికినాను. మిగిలిన 16 ను నీవు అప్పుడేవడికివైచినావా? ఆహా! మనమింతసేపూ కులాసాగా మాటలూ ఆడుకొన్నాము—బోలెడు దారము తయారుచేసాము.

రామా: అందుకే రాట్నాన్ని సుదర్శనచక్రమన్నారు. మన దౌర్భాగ్యానికి హేతువైన సోమరితనపుపిశాచము ఈరాట్నచక్రము తిరిగే యింటిచాయలకైనా రాలేదు

వెంక—నేనువృథాగా కూర్చున్నానుకాని, ఇంకోరాట్నముండి వడికితే, వట్లో ఇంత దారము తయారై పోయి యుండును—సరే; మనము ప్రచారానికి బయలుదేరుదామా మరి—

ఇట్లు మాట్లాడుచు ముందు వెంకటశాస్త్రియు, వెనుక రామారావును గదివెలుపలికి వచ్చినారు. వెంకటశాస్త్రి గదితలుపు గొళ్లెము పెట్టి తాళము నొక్కివేసినాడు. ఇరువురు కలిసి జాతీయమహావిద్యాలయమున కేగినారు. అచ్చట తమ నిర్ణయకార్యము లొనర్ప సంసిద్ధులైయున్న మిత్రబృందముతో కలిసికొని వారందరు ప్రచారము చేయబూనినారు.

బాణాసంచులు కొనుక్కొనుటకు తమ తండ్రుల వెంటబోవుచు కొందఱు బాలురు వారికి మార్గములో కనబడినారు. ఆపిల్లలు చేయబోవుపనికిని తానుచేయదల

దలచిన పనికిని గలుగుఫలితముల తారతమ్యముల గురించియు, ఆనందముల తేడాలను గురించియు వితర్కించుకొనుచు, సహజముగ తనకు దేశసేవానురక్తిని గల్గించినందుకు, భగవంతునకు లోలోన ధన్యవాదము లర్పించుచు రామారావు ప్రఫుల్లహృదయముతో వారివెంటబోయి ప్రచార మొనర్చి, సఫలీకృతమనోరథుడై, రాత్రికి స్వగృహము చేరుకొన్నాడు.

## ౮

రామారావుతండ్రి లక్ష్మణరావుగారు జమీందారీయిలాకాను నెలకు 80 రూపాయలు జీతముగల ఉద్యోగములో నున్నారు. ఆయన భార్య సీతామహాలక్ష్మమ్మ సదాచార సంపన్నయు, దేశాభిమానయునై సాధ్వీమణియని పేరుగాంచినది. ఆమెకు మగపిల్లలు అయిదుగురు, ఆడుపిల్లలు ముగ్గురు, మొత్తము ఎనమండుగురు సంతానము కలిగి అందరు బాగున్నారు. పెద్దకుమారుని పేరే రామారావు. అతని వయస్సిప్పుడు రమారమి ఇరువది సంవత్సరములు. ఆడుపిల్లలలో కడసారపు బాలికయు సీతామహాలక్ష్మమ్మగారి యారవ సంతానమును నగు రాజ్యం చాలా తెలివిగలది; చురుకైనది. ఆమెకు కడచిన దసరాకు ఎనిమిదేళ్లు దాటి తొమ్మిదవఏడు వచ్చినది. ఆమెవెనుక గల్గిన మగబిడ్డలిద్దరు చాల చిన్న పిల్లలు.

ఆయింట్లో లక్ష్మణరావుగారును, చిన్నమగ శిశువులిద్దఱును తప్ప మిగిలినవారందరు రాట్నముమీద బహు సున్నితముగను, త్వరితముగను నూలు తీయగలిగినవారే. వారందరును నప్పుడప్పుడు పందెములు వైచికొని నూలు తీయుచుండుట కలదు. అది వారికొక వినోదప్రాయముగా నుండునేకాని పనిగా కాన్పింపదు. ఆపందెములందు నాణెమైన నూలుతీసినవారిలో రాజ్యమే తరుచు ప్రథమస్థాన మాక్రమించుచుండును. ఆముద్దుబాలికను చూచి మెచ్చుకోని వారొక్కరును లేరు.

లక్ష్మణరావుగారింట్లో దీపావళికి ప్రత్యేకము బాణసంచులకొరకు 8 రూపాయలు వ్యయపఱుపబడుట వాడుక. ఈసంవత్సరము దీపావళిపండుగ వారమురోజులున్నదనగానే పండుగులప్రయోజనముగూర్చియు, దీపావళిని సార్థక మొనర్పవలసిన పద్ధతినిగూర్చియు రామారావు తన తల్లికిని సోదరీసోదరులకును బాగుగ నచ్చునాగున బోధించియుండెను. అందుచే సీతామహాలక్ష్మమ్మ తనభర్తగారితో చాలసేపు వాదప్రతివాదములు చేసి ఏలాగైననేమి మొత్తముమీద ఆసంవత్సరము దీపావళికి ఎనిమిద రూపాయలును రామారావు ఇష్టప్రకారము ఖర్చుపెట్టనిచ్చుటకు అనుమతి పొందెను. అయినను బొత్తిగా టపాసులు కొననియెడల తనభర్తగారికి కోపమువచ్చునేమో అని, సగము దేశోపకారకృత్యములకును సగము బాణసంచులకును ఖర్చుపెట్టిన బాగుండునేమో అని సీతామహాలక్ష్మమ్మ రామారావునకు హితము కరపెను.

పండుగ మూడురోజులున్నదనగానే రామారావు దీపావళీ కార్యక్రమమును తనహృదయఫలకముపై ఇట్లు లిఖించుకొనియున్నాడు.

| | రు. | అ. | పై. |
|---|---|---|---|
| స్థానిక జాతీయవిద్యాలయమునకు దీపావళిభిక్ష | 1 | 0 | 0 |
| సోదరీసోదరుల నూలు పోటీ పరీక్షకు ఏకులు సవాసేరు | 0 | 8 | 0 |
| కృతార్థులకు ప్రథమబహుమతి | 1 | 4 | 0 |
| ,, 2 వ బహుమతి | 0 | 12 | 0 |
| ,, 3 వ బహుమతి | 0 | 8 | 0 |
| స్వదేశపు బాణసంచులు | 4 | 0 | 0 |

వెంకటశాస్త్రితో సంభాషణము చేసి వచ్చిన వెనుక రామారావునకు పూర్తిగ హృదయపరివర్తనము కలిగినది. నాటిరాత్రి పండుకొన్నప్పుడు అతడు తన కార్యక్రమ పట్టికయందుగల చివరవిషయమును మార్చక తప్పదను నిశ్చయమునకు వచ్చెను.

తెల్లవారినది; దీపావళిపండుగ వచ్చినది. ఆనాడుదయమున వెంకటశాస్త్రియును, రామారావును నిర్ణయస్థలములలో జాతీయమహావిద్యాలయమునకు దీపావళిభిక్ష వసూలుచేయుచు ఖద్దరుప్రచారము చేసినారు. మధ్యాహ్నము 12 గంటలకు తిరిగి వచ్చునప్పుడు రామారావు $5\frac{1}{2}$ గజముల ఖద్దరు పరికిణీగుడ్డ కొని తెచ్చినాడు.

మధ్యాహ్నము భోజనములు చేసిన పిమ్మట రామారావు మెల్లగా తనతల్లిని పిల్చి "అమ్మా, నీవు నామీద కోపపడకు. 4 రూపాయలు అనవసరముగా బాణసంచులుకొని కాల్చి పారవేయుటవలన ఏమియులాభము లేదుకదా! పైగా దీపావళి నేర్పాటుచేసిన మన పెద్దల యుద్దేశ్యమును వృధాచేసి వారిపట్ల ద్రోహముచేసినట్లగును. ఆవిషయమై నాకు పూర్ణమైన నమ్మకమున్నది. అందుచేత ఆనాల్గురూపాయలలోను రు 3-7-0 పెట్టి ముద్దులుమూట గట్టుచున్న ఒకపువ్వుల ఖద్దరు పరికిణీగుడ్డకొని తెచ్చినాను. తక్కిన తొమ్మిది అణాలు పెట్టి అది ఒక పటకాపరికిణీయు, జాకెట్టును కుట్టించి, నాణెమైన నూలుతీసిన ఆడుపిల్లకు అది ప్రత్యేకపుబహుమతిగ నీయవలెనని నాయుద్దేశ్యము. టపాకాయలు కొననందుకు నాన్నగారు కోపపడకుండ చేయుమని నిన్ను బ్రతిమాలుచున్నాను. తమ్ములను, చెల్లెళ్లను ఒప్పించడము బాధ్యత నాది" అని చెప్పెను. తనముద్దు చెల్లెలగు రాజ్యానికి దుస్తులను దీపావళి కానుకగా నీయనెంచిన రామారావు పవిత్రహృదయమును తల్లి చాలమెచ్చుకొనెను. "బాణసంచులు లేకుండుటచే మీలో నెవ్వరికిని సంతోషభంగము కాకపోయేటట్లయితే మధ్యమీ నాన్నగా రెందుకు కలుగజేసికొందురులే! నీవు చేసిన పని బాగానే ఉన్నది." అని ఆమె అతనికి అభయహస్తమిచ్చినది. నాటిమధ్యాహ్నము 4 గంటలకే క్రొత్త దుస్తులు తయారై వచ్చినవి.

౬


సీతామహాలక్ష్మమ్మ, ఎత్తయి విశాలమైయున్న తమ గచ్చు అరుగులు కడిగి శుభ్రపరిపించెను. రాట్నములకు పసుపు రాసి కుంకుమబొట్లు పెట్టి అలంకారము చేయించెను. అరుగు ఒక్కంటికి మూడేసి రాట్నముల చొప్పున వేయించి ప్రతిరాట్నమువద్దను తగిన యెత్తుపీటలు పెట్టించెను. ఆయరుగులపై నడుమగా నొక్కొక్క విద్యుద్దీపము వ్రేలాడగట్టించెను. ఆప్రదేశమంతయు నత్యంత కాంతిమంతమై పట్టపగటిని మరపించుచుండెను. ఇంతకుముందే వారివీథిఅరుగులకు ఎదురుగా కట్టెలతో మెట్లువలె కట్టించి, సీతామహాలక్ష్మమ్మ నాలుగేసి వరుసలను ప్రమిదెదీపములు పెట్టించెను. విద్యుద్దీపద్యుతుల ముందు కొంచెము వెలవెల బోవుచున్నట్లగపడుచున్నను ఆదీపావళి తత్ప్రదేశమున కొకవింత యందమును గల్పించుచునే యుండెను.

ఆరోజున ఆరుగంటలకే బాలికాబాలకులందరును భోజనములు ముగించిరి. పిండివంటలారగించుట, తాంబూలములు వేసికొనుట, ప్రమిదదీపములు సర్దుట మొదలగు పనులక్రింద రమారమి ఒక అరగంటయయ్యెను. రామారావు కోరిక ననుసరించి సీతామహాలక్ష్మమ్మ రాట్నపు పరీక్షాధికారిణిగ నుండ నంగీకరించెను. సవాసేరు(=ఏబులము) ఏకులను ఆమె ఆరు సమానములగు కట్టలుగ కట్టించెను. రమారమి నలువదియైదేసి ఏకులుగల యాకట్టయొక్కొక్కటియు, నాలుగేసి కదుళ్లును, ఆమె ప్రతి రాట్నమువద్దను పెట్టించి యుంచెను.

సరిగా 6½ గంటలకు సీతామహాలక్ష్మమ్మ తన చేతిలోని స్ప్రింగుగంట నొక్కెను. గంట మ్రోగుచుండగానే వస్త్రధారులై కలకలలాడు మోములతో ముగ్గురు బాలికలును, ఒక అరుగుమీదకును, ముగ్గురు బాలురును మఱియొక అరుగుమీదకును చేరి వరుసగా తమతమ రాట్నములవద్ద ఎత్తుపీటలపై కూర్చుండిరి. అప్పుడే మఱల రెండవగంట మ్రోగినది. ప్రతియొక్కరును చేతితో నొక్కొక్క ఏకుతీసికొని యెదురుననున్న దారపు కొనలతో తమ ఏకు చివరలను అతికించిరి. సీతామహాలక్ష్మమ్మ మూడవసారి గంట మ్రోయించెను. వారారుగురు నొక్కసారిగా రాట్నములు త్రిప్పుట ప్రారంభించిరి. ఆదృశ్యము చూచుటకు కన్నుల పండువుగ నుండెను.

ఊరిలో అందరును బాణసంచులుకొని ఉత్సాహముతో కాల్చుకొనుచుండగా తమ బాలికాబాలకులు ధనహీనులవలె గృహమున కూర్చుండియుండి, బయటకు వచ్చుటకే సిగ్గుపడుచు దీనులవలెగాన్పింతురేమో అని లక్ష్మణరావుగారు మొదట అనుకొనిరి. కాని ఊరిలో నందరికంటెను నత్యధికోత్సాహవంతులై తేజస్సంపన్న

ములగు మోములతో పచ్చనిరాట్నముల యెదుట దేవతలవలె కూర్చుండి పంతములమీద నూలువడుకుచున్న యాసుకుమార మూర్తులను చూడగానే ఆయనకు సంతోషముచే ఒడలు పరవశమయ్యెను. లక్ష్మణరావుగారు వీథివాకిట్లో నిలువబడి అదృశ్యమును తదేకదృష్టితో చూడసాగిరి.



సీతామహాలక్ష్మమ్మ చంటిపిల్ల వానిని చంకనెత్తుకొని రాజ్యము రాట్నమువద్ద నిలువబడి "నీవుఎక్కువ దారము తీయుటకు ప్రయత్నింపకు. నాణెమైన దారము తీసినందుకు ప్రత్యేక బహుమతిగలదు. నీదారమే చాలసన్నా నాణెముగ ఉన్నది. ఆబహుమతి తప్పక నీకేవచ్చును. ఆలాగే తీయుము. తొందరపడిలావుతీయవద్దు" అని ప్రోత్సాహవాక్యములు పలుకుచుండెను. వారి చిన్నపిల్లవాడు మూడేండ్లప్రాయముగల ఆనందరావు లాగును,చొక్కాయును తొడిగికొని, తలపై తెల్లని ఖద్దరుటోపీతో రాజ్యము రాట్నము దగ్గర మఠమువైచికొని కూర్చుండియుండి "రాజ్జైమక్క—బాగా నూలు తీత్తే— నేనే బగుమానం, ఇత్తాను—అమ్మా— నువ్వియ్యొద్దు. ఏమే! బుల్లెక్కా! నేనే ఇత్తానుకాదూ" అని తల్లితోను, అక్కతోను పుంఖాను పుంఖముగవచ్చియు రాని ముద్దుమాటలు గుప్పించుచుండెను.

లక్ష్మణరావుగారు సీతామహాలక్ష్మమ్మను సంబోధించుచు "నీ ఏర్పాటు చాల సంతోషదాయకముగానే యున్నదిసుమా! ఈదీపావళి ఖర్చు నిజముగా సద్వినియోగమైనది" అనెను. ఇంతలో అచ్చటకు వెంకటశాస్త్రివచ్చి ఆదృశ్యమును, లక్ష్మణరావుగారి ప్రశంసావాక్యములను, గమనించి రామారావు విచిత్రపు ఏర్పాటునకు మిక్కిలి ఆశ్చర్యపడి యాతని నెంతయు మెచ్చుకొనెను.

అప్పుడు లక్ష్మణరావుగారును, వెంకటశాస్త్రియు దేశపరిస్థితులను గూర్చియు, శ్రీ గాంధిమహాత్ముని దయచేత ముఖ్యముగా యువకులయందు గల్గుచున్న హృదయపరివర్తనము గూర్చియు చాలసేపు మాట్లాడుకొనిరి. అప్పటికి గం. 10–20 నిమిషములయ్యెను. "ఇక 10 నిమిషములు మాత్రమే వ్యవధియున్నది. తరువాత నెవ్వరును రాట్నము ను తాకుటకు వీలులేదు జాగ్రత్త" అని సీతామహాలక్ష్మమ్మ బాలికా బాలకులను హెచ్చరించెను. మగపిల్లలలో రామారావును, ఆడుపిల్లలలో రెండవయామెయగు రత్నావతియు తమ పాలియేకులన్నియు పూర్తిగ వడికివైచితిమని ఒక్కసారిగా లేచిరి.

సీతామహాలక్ష్మమ్మ సరిగా గం. 10–30 ని॥ లకు తనస్ప్రింగుగంటను నొక్కి మ్రోయించెను. పెద్దకుమార్తెయగు రంగనాయకమ్మ "నానూలు కూడ పూర్తియైనదమ్మా—" అని చేతులు గులుపుకొనుచు లేచెను. మిగిలినవారికి రెండేసియో, మూడేసియో మాత్రము ఏకులు మిగిలెను. ఒక పావుగంటలోనే బహుమతుల నిర్ణయమొనర్చి సీతామహాలక్ష్మమ్మగారు ఈ క్రింది ఫలితములు చదివెను.

| | | | |
|---|---|---|---|
| అందరిలో మిక్కిలి నాణెమైన నూలువడికి నందుకు రాజ్యమునకు ప్రత్యేకబహుమతి | } 4 రు. వెలగల పరికిణీయు జాకెట్టును. | | |
| రత్నావతికి ప్రథమ బహుమానము | రు 1 | 4 | 0 |
| రామారావునకు ద్వితీయబహుమానము | 0 | 12 | 0 |
| రంగనాయకమ్మకు తృతీయబహుమానము | 0 | 8 | 0 |

"తక్కిన మగపిల్ల లిద్దఱు తీసిన నూలుకూడ చాల బాగుగానే యున్నది. వాండ్రుకూడ బహుమతి కర్హులే కాని 4 బహుమతులే యేర్పాటు చేయబడుటచే వాండ్రకు ప్రస్తుతము బహుమతులొసగ జాలనైతి"నని సీతామహాలక్ష్మమ్మగారు చెప్పిరి. రామారావు రెండవ బహుమతిని తాను తీసికొనక తనతమ్ము లిద్దరికిని చెరి యొక పావలాయును బుల్లితమ్ముడగు ఆనందరావునకు మిగిలిన పావలాయును నిప్పించెను. మొత్తముమీద వారందరును పరమానందభరితులై దీపావళిని సార్థకపఱచిరి.

వెంకటశాస్త్రి స్వగృహమున కేగి తనమిత్రుడు రామారావు జరిపిన దీపావళిపండుగను గూర్చి తన తలిదండ్రులతోను, తమ్ములతోను వినోదకథవలె వన్నెలు, చిన్నెలు చేసి చెప్పి వారిని సంతోషసాగరమున నోలలాడించెను.

---

## ఉమారమణా!

కొత్తపల్లి సూర్యారావు గారు

వినుచు నస్పృశ్యము నంటు, దర్భఁ గొని పేర్మి నీవుఁ పునం దాల్తు, వ
గ్నిని గన్ జెప్పను మాటు, దాపవనుని న్నిశ్వాసమాత్రంబుగాఁ
గొను, దుర్వ న్మృదుపీఠముం బలెనె కైకోఁ జాలు, దే మంచు ని
న్వినుతింతున్ ఘను నోయుమారమణ, వాఙ్నిర్మాణవైచిత్రితోన్.

గాలికి రూప మిచ్చెదవు కన్నులకుం గనరావు; డెందమం
దోలిన చూడఁగాఁ బడుదు వో ప్రభు, చూచెడి దెద్ది యందుఁ బ్రా
జ్ఞాలికి; నీదుచిత్రమును జ్ఞానులునున్ లిఖియింపలేరు నే
నా లఘుబుద్ధి నెంతుఁ దగుదంచు నుమారమణా, భవద్గతిన్.

గగనము కౌను, మేఘములు కైశ్యము, పృథ్వి నితంబ, మగ్ని ఫా
లగతిలకంబు, సూర్యుఁడు గళాపతి కన్నులు, శేషుఁ డారు, వా
యుగతి వచో విలాసము, పయోధులు రాగరసంబు, దిక్కులే
జిగిగల పుట్టముల్ ప్రకృతిశీల, కుమారమణా, త్వదార్యకున్.

నీయం దుద్భవ మయ్యె భూతములు లేనే లేవు నీకంటె ము
న్నాయైదు న్నినుఁ బట్టి యున్న కతనన్ వ్యామోహాతం జెట్టొ వి
త్తో యే దా మొదలం చెఱుంగక భవద్రూపంబుగా నెంచుఁ బై
పై యాకారముచే నుమారమణ, విద్వద్బృంద మల్లేకదా!

---